ప్రజాశక్తి

ఆదివారం 23 ఫిబ్రవరి 2025 8 పేజీలు




ప్రకాశం బాపట్ల



మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియా

భూ అక్రమాలపై ఉక్కుపాదం మోపండి

- రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి
- శాఖ ప్రతిష్ట కోల్పోయేలా ప్రవర్తిస్తే సహించబోను
- అధికారులకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భూఅక్రమాలపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియా స్పష్టం చేశారు. చట్టానికి ఎవరూ అతీతం కాదని ఆయన సూచించారు. శనివారం కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డిఆర్‌ఒ బి. చినఓబులేసుతో కలిసి రెవెన్యూ అధికారులతో ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రీ సర్వే, ఆర్‌ఒఆర్ కేసులు, రెవెన్యూ సదస్సులు, గ్రీవెన్స్ కార్యక్రమాలలో వచ్చిన రెవెన్యూ సంబందిత ఆర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై ఆరా తీశారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయా విషయాలను సంయుక్త కలెక్టరుకు వివరించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ ఎన్నికలు, ప్రకతి విపత్తుల సమయాలలో ▶ 2లో

ధర లేక విలవిల

- నష్టాల బాటలో రైతన్నలు
- పొగాకు సాగు విస్తీర్ణం పెరిగినా.. తగ్గిన ధర
- మిర్చి సాగు తగ్గినా.. ధర పెరగని వైనం



పొగాకు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఈ ఏడాది జిల్లాలో ఒక్క పొగాకు తప్ప అన్ని రకాల పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. వ్యవసాయానికి ప్రకృతి అనుకూలంగా లేకపోవడం, పంటల సాగు పెట్టుబడి ఖర్చులు పెరగడం, గిట్టుబాటు ధరలు లేకపోవడం తదితర కారణాలతో సాగు విస్తీర్ణం తగ్గింది. మిర్చి, శనగ, పత్తి సాగు బదులుగా రైతులు అధికంగా పొగాకు సాగు చేశారు. ఈ కారణంగా జిల్లాలో మిర్చితో సహా పప్పు, చిరు ధాన్యాలు, నూనె గింజల పంటల సాగు తగ్గిపోయింది. పొగాకు సాగు విస్తీర్ణం పెరిగింది. కానీ ధర లేక రైతుల గగ్గోలు పెడుతున్నారు. మిర్చి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. కానీ గిట్టుబాటు ధర శూన్యం. పంట రైతు చేతికి అందే దశలో ఈ ఏడాది ధరల మాయాజాలంతో రైతులు నష్టాల సుడిగుండంలో చిక్కారు.

ఒక సంవత్సరం ఏదైనా పంట దిగుబడి వచ్చి ధర కూడా బాగా పలికితే మరుసటి సంవత్సరం అత్యధికంగా సదరు పంటను సాగుచేయడం.. నష్టపోవడం.. రైతులకు పరిపాటి అయ్యింది. ఎప్పుడు ఏ పంటకు ధర ఉంటుందో అర్థం కాక రైతులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. గతేడాది మంచి ధర పలికిన ధాన్యం, ఇతర పంటల కొనుగోలు ధరలు ఈ ఏడాది లేకపోవడంతో రైతులు దిగాలు పడ్డారు. జిల్లాలో ప్రధానంగా వరి పంటతో పాటు పత్తి, పొగాకు, మిర్చి, శనగ, మొక్కజొన్న, వేరుశనగ, పెసలు, మినుము, జొన్న పంటల సాగు అత్యధికంగా జరుగుతోంది. వరి మినహా మిగతా పంటలు అత్యధికంగా రబీలో సాగవుతాయి. గతేడాది ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఈ ఏడాది పంటల సాగు గణనీయంగా తగ్గిపోయింది. సంవత్సరాల తరబడి పత్తి సాగు చేసిన రైతులు వరుస నష్టాల కారణంగా పత్తి సాగు చేయడం మానేశారు. మిర్చి సాగు చేసిన రైతులు అత్యధికులు గడిచిన రెండేళ్లుగా నష్టపోతూ వచ్చారు.

పెట్టుబడి వ్యయం పెరగడం, దిగుబడి వచ్చినా ధర లేకపోవడం, ఎక్కువగా చీడపీడలు ఆశిస్తున్న కారణంగా మిర్చి సాగుకు రైతు ఈ ఏడాది వెనకంజ వేశారు. శనగ కూడా ఆశించిన దిగుబడులు రాక, ధర లేక రైతులు నష్టపోతూ వచ్చారు. అయితే గతేడాది వైట్‌బర్లీ, బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు లాభాలు చవిచూశారు. ఎకరా పొగాకు సాగుకు లక్షన్నర వరకు పెట్టుబడి ఖర్చులు కాగా, రూ.లక్షన్నర మేర లాభాలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది జిల్లాలో రైతులు అత్యధికంగా పొగాకు సాగు చేశారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 17 వేల ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 64 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. గత ఏడాది రైతులు బ్లాక్‌బర్లీ పొగాకు సాగు చేయగా ఎకరాకు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి ▶ 2లో

'తవనం' స్ఫూర్తి.. ప్రజా ఉద్యమాలకు మార్గదర్శకం

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపు
- మాజీ ఎమ్మెల్యే చెంచయ్యకు ఘన నివాళి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లా వ్యవసాయ కార్మికోద్యమ నిర్మాత తవనం చెంచయ్య అందించిన ప్రజా ఉద్యమస్ఫూర్తి యువతరానికి మార్గదర్శం కావాలని, ఆయన అందించిన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు పదును పెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య 11వ వర్ధంతి సందర్భంగా శనివారం నాడు స్థానిక ఎల్‌బిజి భవన్‌లో 'కేంద్ర బడ్జెట్ – గ్రామీణ పేదలపై ప్రభావం' అనే అంశం మీద జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ▶ 2లో



మాట్లాడుతున్న రమాదేవి

ఎమ్మెల్సీగా లక్ష్మణరావును గెలిపించండి

▶ 5లో

అబ్బర్వార్ల నియామకంలో అవకతవకలు

'బిఇడి' పరీక్షల నేపథ్యంలో అక్రమాలు!

▶ 5లో

'తవనం' స్ఫూర్తి.. ప్రజాఉద్యమాలకు మార్గదర్శకం..

(మొదటిపేజీ తరువాయి)

చెంచయ్య 92 ఏళ్ల జీవితంలో 70 ఏళ్లకు పైగా ప్రజా ఉద్యమాలకు అంకితం చేశారని, భూసమస్య, కూలి వంటి సామాజిక సమస్యలపై పోరాటాలకు నాయకత్వం వహించిన చెంచయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలని సూచించారు. నాడు సమాజంలో కొనసాగుతున్న అంటరానితనం, అసమానతలు (కులవివక్షత)పై, పెత్తందారుల దౌర్జన్యాలపై కమ్యూనిస్టు ఉద్యమం నడిపిన పోరాటాలు చెంచయ్యను ఆకర్షించాయని గుర్తు చేశారు. అప్పట్లో యువతను సమీకరించి సాగు భూముల సాధన కోసం బావులు, చెరువు నీటిపై దళితులకు హక్కు పొందేలా, కనీస వేతన (కూలి) చట్టం కోసం చెంచయ్య నడిపిన పోరాటాలతో ప్రాసంగలపాడు పోరాటాల పురిటి గడ్డగా మారిందని వివరించారు. 1955 ప్రాంతంలో ఉద్యమ అవసరాల రీత్యా ఒంగోలుకు వచ్చిన ఆయన తన ఇంటిని ఉద్యమ కేంద్రంగా నడిపారని గుర్తు చేశారు. త్యాగమూర్తుల కృషితో సాధించుకున్న హక్కులను, చట్టాలను పాలకులు నిర్వీర్యం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పోరేట్లకు వరాలు అందించేదిగా, కష్టజీవులపై భారాలు మోపేదిగా ఉందన్నారు. పేదల సబ్సిడీలతో దేశం అధోగతి పాలవుతుందని న్యాయ మూర్తులు వక్రీకరించడం అత్యంత విచారకరమన్నారు. సంపన్నుల రాయితీలు వరాలుగానూ, సామాన్యుల రాయితీలు ఉచితాలుగా వ్యాఖ్యానించడం అభ్యంతరకరమన్నారు. ఉచితాలందిస్తే పేదలు సోమరిపోతులుగా మారుతున్నారనే న్యాయ మూర్తుల వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.50 లక్షల కోట్లతో రూపొందిన కేంద్ర బడ్జెట్లో గ్రామీణ అభివృద్ధికి గత సంవత్సరం రూ.2.60 లక్షల కోట్లు కేటాయించి.. రూ.1.90 లక్షల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని గుర్తు చేశారు. ఆహార భద్రతకు రూ2.70 లక్షల కోట్లు కేటాయించి రూ.2.04 లక్షల కోట్లు ఖర్చు చేశారని గుర్తు చేశారు. ఎరువుల సబ్సిడీ, ధరల నియంత్రణకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. వ్యవసాయ రంగానికి రూ.5 లక్షల కోట్లు కేటాయిస్తేనే కనీస మద్దతుధరల చట్టం అమలుకు, వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయటపడటానికి, రైతాంగ ఆత్మహత్యలు నిలువరించడానికి వీలుటుందన్నారు. ప్రజానుకూల బడ్జెట్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రజలు ఉద్యమాలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు జాలా అంజయ్య మాట్లాడుతూ 35 సంవత్సరాలకు పైగా తవనంతో కలిసి ఉద్యమాల్లో పాల్గొన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పోరాటయోధుడుగా, శాసనసభ్యుడుగా ఆయన నిర్వహించిన పాత్ర చిరస్మరణీయమైనదని అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ప్రజా ఉద్యమాలకు పెద్దదిక్కుగా తవనం నడిపిన పోరాటాలు స్ఫూర్తినిచ్చాయని అన్నారు. పాలకుల విధానాల వల్ల ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర లభించని పరిస్థితి నెలకొందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్కె మాబు మాట్లాడుతూ రూ.64 లక్షల కోట్ల వ్యవసాయ రంగ ఉత్పత్తులపై కార్పొరేట్లకు పెత్తనం కల్పించేందుకు కేంద్రం ప్రయత్నం చేస్తోందన్నారు. వ్యవసాయ రంగాన్ని దివాలా తీయించి గ్రామీణ పేదల నోట మన్ను గొట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలని సూచించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తుల మీద 2 శాతం పన్ను, సంపద మీద నాలుగు శాతం పన్ను వేయటం ద్వారా దేశంలో ఉన్న నిరుద్యోగ సమస్య, ఆకలి చావులు, ఆత్మహత్యలు, వ్యవసాయ రంగ సంక్షోభం లాంటి సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. సెమినార్‌కు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. తొలుత తవనం చెంచయ్య చిత్రపటానికి అంగలకుర్తి బ్రహ్మయ్య, పట్టపు ప్రకాశం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు కేజీ మస్తాన్, వూసా వెంకటేశ్వర్లు, మోంద్రు ఆంజనేయులు, ఉబ్బా వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు, బడుగు వెంకటేశ్వర్లు, గుమ్మా బాల నాగయ్య, వై వీరనారాయణ, కంకణాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధర లేక విలవిల

(మొదటిపేజీ తరువాయి)

వచ్చింది. ధర రూ.15 వేల వరకు పలికింది. పెట్టుబడి ఖర్చులు పోనూ ఎకరాకి రూ.లక్షన్నర మేర ఆదాయం వచ్చింది. వైట్‌బర్లీ కూడా ఎకరాకు 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ధర రూ.18 వేల వరకు పలికింది. దీంతో రైతులకు వైట్‌బర్లీ సాగుతో కూడా రూ.లక్షన్నర మేర ఆదాయం వచ్చింది. దీంతో ఈ ఏడాది రైతులు శనగ, మిర్చి సాగును కూడా పక్కనపెట్టి పొగాకు సాగు చేశారు. గతేడాది ఐదెకరాల్లో పొగాకు సాగు చేసిన రైతులు ఈ ఏడాది 10 ఎకరాల చొప్పున సాగు చేశారు. ఈ కారణంగా జిల్లాలో శనగ, మిర్చి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. కానీ ఈ రబీలో పొగాకు సాగు చేసిన రైతులు తగిన దిగుబడి రాక, ధర లేక పోవడంతో డీలా పడ్డారు. జిల్లాలో రైతులు అధికంగా బ్లాక్‌బర్లీ సాగు చేశారు. ఈ ఏడాది సగానికి సగం దిగుబడి తగ్గగా ధర కూడా ఈ ఏడాది రూ.8 వేల లోపు పలికింది. అడుగులు అయితే క్వింటా రూ.4 వేలు ధర మాత్రమే పలికింది. వైట్‌బర్లీ ధర కూడా రూ.12 వేల లోపు ఉంది. ఈ కారణంగా జిల్లాలో పొగాకు సాగు చేసిన రైతులు నష్టాలపాలయ్యారు.

గతేడాది జిల్లాలో మిర్చి సాగు చేసిన రైతులు నష్టపోయారు. తుఫాను, భారీవర్షాల కారణంగా మిర్చి పంటను రైతులు కోల్పోయారు. తిరిగి కొందరు రైతులు మరలా మిర్చి సాగు చేశారు. కానీ మిర్చి దిగుబడులు తగ్గాయి. పెట్టుబడులు మాత్రం పెరిగిపోయాయి. క్వింటా ధర రూ.12 వేలు పలికింది. రైతులు లక్షల్లో నష్టపోయారు. ఈ కారణంగా జిల్లాలో ఈ సీజన్‌లో మిర్చి సాగు గణనీయంగా తగ్గిపోయింది. సాధారణ సాగు 16 వేల ఎకరాలు కాగా ఈ ఏడాది 8500 ఎకరాల్లో మాత్రమే రైతులు మిర్చి సాగు చేశారు. కానీ ధర లేకుండా పోయింది. గతేడాది మిర్చి క్వింటా ధర రూ.22 వేల వరకు పలికింది. ఈ ధర మరింత పెరుగుతుందేమోనని కొందరు రైతులు కోల్డ్‌స్టోరేజీల్లో భద్రపర్చుకున్నారు. ప్రస్తుతం మిర్చి ధరలు పతనమయ్యాయి. తొలి కోత కాయ కూడా రూ.10 వేల నుంచి రూ.12 వేలకే అడుగుతున్నారు. ప్రతి ఏటా మిర్చి సాగు వ్యయం బాగా పెరిగిపోతోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మిర్చి రకాలు తెగుళ్ళ తట్టుకోలేక పోతున్నాయి. అనేక రకాల తెగుళ్ల నుంచి మిర్చి పంటను కాపాడుకొని రైతులు మార్కెట్‌లోకి తీసుకొస్తే ధర లేక వారి పరిస్థితి దయనీయంగా ఉంది. దీంతో మిర్చిని రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచుదామంటే తెచ్చిన అప్పులు, దానిపై వడ్డీలు పెరుగుతున్నాయి. కోల్డ్‌స్టోరేజీల్లో ఉంచినా రానున్న రోజుల్లో ధర ఎలా ఉంటుందోనన్న అనుమానాలు రైతులను వెంటాడుతున్నాయి. ధరల పరిస్థితి ఇలానే ఉంటే రైతులు కోలుకోని రీతిలో నష్టపోతారు. దీంతో కొందరు రైతులు ఇప్పుడున్న ధరకే తెగనమ్ముతున్నారు. దీంతో నష్టాలు తప్పడం లేదు.

భూఅక్రమాలపై ఉక్కుపాదం మోపండి

(మొదటిపేజీ తరువాయి)

రెవెన్యూ సిబ్బంది చిత్తశుద్ధి, అంకిత భావం, సమర్ధవంతంగా పనిచేస్తారనే గుర్తింపు ఉందన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారంలో కూడా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ శాఖ ప్రతిష్ట కోల్పోయేలా ఎవరైనా ప్రవర్తిస్తే సహించబోనన్నారు. ముఖ్యంగా గ్రీవెన్స్‌లో వస్తున్న ఆర్జీలలో 60 శాతం వరకూ రెవెన్యూ సంబంధిత సమస్యలనే ప్రజలు ప్రస్తావిస్తున్నారన్నారు. పరిష్కరించదగిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. తమ స్థాయిలో పరిష్కరించలేని సమస్యలైతే అదే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని దిశా నిర్దేశం చేసారు. సహేతుకంగా పరిష్కరించడం ద్వారా ఆర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలన్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై తహశీల్దార్లకు స్పష్టమైన అవగాహన వుండాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. కేవలం విఆర్ఓ నివేదికపైనే ఆధారపడకుండా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిత్యం క్షేత్రస్థాయిలో ఉండేలా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. తహశీల్దార్లు ఎల్లప్పుడూ మండల కేంద్రంలోనే ఉండాలని స్పష్టం చేశారు. సర్వే శాఖలో తగినంత సిబ్బంది ఉండటంతో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనన్నారు. ప్రస్తుతం జిల్లాలో అందుబాటులో ఉన్న 120 డ్రోన్‌ల ద్వారా రీసర్వే, జాయింట్ ఎల్పిఎం పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. ప్రైవేట్ భూ యజమానులను 22(ఎ) జాబితాలో చేర్చడం ద్వారా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఇలాంటి భూముల కేసులను జిల్లా స్థాయి కమిటీలో చర్చించాలన్నారు. ప్రభుత్వ భూములు మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలోని విఆర్ఒలు ఈ విషయంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కోర్టు కేసులు, లోక్ అదాలత్ కేసులను పర్యవేక్షిస్తూ సత్వరమే పరిష్కారమయ్యేలా అవసరమైన పిటీషన్లు సమర్పించాలన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందిస్తూ గ్రీవెన్స్ ఆర్జీల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ఆర్జీలను మార్చి మొదటి వారం నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. మీ ఆదేశాలు, సూచనల మేరకు రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని, ఏమైనా సందేహాలు వుంటే తమ దష్టికి తీసుకువస్తామని సిసోడియాకు తెలిపారు. సమావేశంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మిప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి పుష్పలతి, జిల్లా రిజిస్ట్రార్ ఏ.బాలాంజనేయులు, సర్వే శాఖ సహాయ సంచాలకులు గౌస్ బాష, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, అసిస్టెంట్ ఫారెస్ట్ కన్జర్వేటర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, తహసిల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

అగ్రహారం లేఅవుట్ పరిశీలన

అనంతరం ఒంగోలు నగర శివారు లోని ఎన్. అగ్రహారం గ్రామంలో గతంలో పేదలకు కేటాయించిన ఇళ్లస్థలాల లేఅవుట్‌ని రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియా పరిశీలించారు. ఇందుకు సంబందించిన వివరాలను సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆయనకు వివరించారు. రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వెంట హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్, ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మి ప్రసన్న, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఒంగోలు తహశీల్దార్ వాసు, ఇతర అధికారులు ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-టంగుటూరు


గ్రామీణ నీటి సరఫరా అధికారులతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

కొండపి నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు ఇబ్బంది లేకుండా మంచినీరు సరఫరా చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. శనివారం నాడు తూర్పునాయుడుపాలెం లోని క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ గ్రామీణ నీటి సరఫరా అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న వేసవిలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా మంచినీరు అందించాలన్నారు. అందుకు తగిన ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో ఎంత నీరు అవసరం ఉంది, నీటి సరఫరాకు ఏమైనా సమస్యలున్నాయా అని సంబంధిత విషయాలను అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, అధికారులంతా బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా మంత్రి అన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

- నాలుగు కిలోల సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి


మాట్లాడుతున్న డిఎస్‌పి లక్ష్మీ నారాయణ

ప్రజాశక్తి- ముండ్లమూరు

గంజాయి విక్రయిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు దర్శి డిఎస్‌పి బి.లక్ష్మీనారాయణ తెలిపారు. ముండ్లమూరు పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడారు. ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన జడ లక్ష్మీనారాయణ, బాపట్ల జిల్లా మార్టూరు మండలం నాగరాజు పల్లి గ్రామానికి చెందిన జడ శ్రీహరి, మొగిలి వంశీ, మార్టూరు నాగరాజుపల్లి రోడ్డులోని సంపత్ నగర్ కు చెందిన ఉప్పు శివ గోపి ముఠాగా ఏర్పడి గంజాయి విక్రయిస్తున్నట్లు డిఎస్‌పి తెలిపారు. నిందితుడు లక్ష్మీనారాయణపై గతంలో మార్టూరు, చీరాల , నరసరావుపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులు కేసులు ఉన్నట్లు తెలిపారు. ఉప్పు శివ గోపి మీద వేటపాలెం పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసు ఉన్నట్లు తెలిపారు. జడ శ్రీహరి పై మార్టూరు పోలీస్ స్టేషన్‌లో మూడు కేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితులు నలుగురు కలిసి గత కొంతకాలంగా సామర్లకోటకు చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి బాపట్ల జిల్లాలోని మార్టూరు, ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో తమ తెలిసిన వ్యక్తుల ద్వారా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఈ క్రమంలో దర్శి సిఐ, ముండ్లమూరు ఎస్ఐలకు అందిన సమాచారం మేరకు మండల పరిధిలోని వేంపాడు గ్రామ ఆంజనేయ స్వామి గుడి వద్ద నిందితులను శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి నాలుగు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దర్శి సిఐ వై.రామారావు నిందితులపై ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్శి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి నిందితులకు రిమాండ్ విధించినట్లు తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న దర్శి సిఐ రామారావు, ముండ్లమూరు ఎస్ఐ నాగరాజు, హెచ్‌ఎస్‌సివెంకటేశ్వర్లు, పిసి మహేష్, హోంగార్డు కాసిం, పోలీస్ సిబ్బందిని ఎస్‌పి ఎఆర్. దామోదర్, దర్శి డిఎస్‌పి లక్ష్మీనారాయణ అభినందించి రివార్డులు ప్రకటించారు.

సాగర్ కాలువలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి- దర్శి

సాగర్ కాలంలో పడి ఓ యువకుడు గల్లంతయ్యాడు. అందిన వివరాల ప్రకారం.. దర్శి మండలం నడింపల్లి గ్రామానికి చెందిన పుప్పాల వీరనారాయణ (17) అనే యువకుడు ఇంటో దర్శి వెళ్లి వస్తానని చెప్పి బైకుపై బయలు దేరాడు. ఎంతకీ ఇంటికి రాలేదు.దీంతో కుటుంబ సభ్యులు వీరానారాణ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సాగర్ కాలువ వద్ద వీరానాయణ యువకుడి తండ్రి వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. దీంతో వెంకటేశ్వర్లు తమ కుటుంబ సభ్యులతో వీరనారాయణ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

త్రోవగుంట – కిమ్స్ హాస్పిటల్ హైవే జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామానికి చెందిన రావులపల్లి అశోక్(34) మరణించాడు. మృతుడు అద్దంకిలో టైల్స్ వర్క్ పని కుదుర్చుకొని తన వాహనంపై ఒంగోలు వస్తున్నారు. త్రోవగుంట సమీపానికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న లారీ కంటైనర్ ఢీకొనడంతో అశోక్ మృతి చెందాడు. ఒ ఒంగోలు తాలూకా పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రావెల్ బస్సులో ప్రయాణికుడు మృతి

ప్రజాశక్తి - చీరాల

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తూ గుండెపోటు రావడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బాపట్ల జిల్లా చీరాలలో శనివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. కారంచేడు గ్రామానికి చెందిన జాగర్లమూడి శివరాంప్రసాద్ (50) హైదరాబాద్ లోని బంధువులు ఇంటికి వెళ్లి పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వచ్చేందుకు ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సులో బయలు దేరాడు. బస్సు తెల్లవారుజామున కారంచేడుకు చేరింది. అయితే ఎంతకీ శివరాంప్రసాద్ బస్సు దిగలేదు. ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ శివరాంప్రసాద్ లేపే ప్రయత్నం చేశాడు. ఆయన ఎంతసేపటికీ లేవక పోవడంతో శివరాంప్రసాద్ మృతి చెందినట్లు నిర్ధారించుకుని చీరాల వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని అదే బస్సులో చీరాల ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి గుండెపోటు రావడంతో నిద్రలోనే శివరాంప్రసాద్ మతి చెందినట్లుగా నిర్ధారించారు. శివరాంప్రసాద్‌కు గతంలో హార్ట్‌లో స్టాంట్స్ వేసినట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బస్సులోనే మృతి చెందిన శివరాం ప్రసాద్

యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి -రేపల్లె : యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్. విజయబాబు హెచ్చరించారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువులు, పురుగుమందుల డీలర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు రైతులకు యూరియాను సకాలంలో అందజేయాలన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని లైసెన్సులు రద్దు చేస్తామని తెలిపారు. యూరియా కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులు పాటించని డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని తెలిపారు. రైతు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందాలంటే ప్రతి ఒక్క రైతు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఆదివారం కూడా సిబ్బంది అందుబాటులో ఉంటారని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని ఆయన తెలిపారు.


మాట్లాడుతున్న విజయబాబు

సారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి- చెరుకుపల్లి

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ శ్రీరాం ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని గూడవల్లి గ్రామ పరిసర ప్రాంతాలలో నాటు సారా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. బస్టాండ్ సమీపంలో మోర్ల వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ప్లాస్టిక్ క్యాన్ పట్టుకొని అనుమానాస్పదంగా తిరుగుతూ ఉండడంతో అతనిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. అతని వద్ద ఐదు లీటర్ల నాటు సారా గుర్తించినట్లు తెలిపారు. ఈ దాడులలో సిబ్బంది శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - పంగులూరు

ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని బైటమంజులూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. అద్దంకి మండలం వెంకటాపురం నుంచి పొగాకు చెక్కలతో ఓ ఆటో బయలుదేరింది. ఆటో ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి జాతీయ టైరు పగిలిపోయింది. దీంతో డ్రైవరు ఆటోను రోడ్డుపైనే ఆపాడు. అదే సమయంలో మైసూర్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్న లారీ ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో బోల్తా కొట్టింది. దంతో లారీ డ్రైవర్ బాలకష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడి మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రేణింగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్రాలు లేని ఆటోలు సీజ్

ప్రజాశక్తి- కొల్లూరు : ఎలాంటి పత్రాలు లేకుండా తిరుగుతున్న ఐదు ఆటోలను శనివారం సీజ్ చేసినట్లు మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ పి. అంకమ్మరావు తెలిపారు. వేమూరులో 2. కొల్లూరులో 3 ఆటోలు పత్రాలు లేకుండా నడుపుతుండగా సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు ఈ సందర్భంగా అంకమ్మరావు మాట్లాడుతూ వేమూరు, కొల్లూరులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. పత్రాలు లేకుండా వాహనాలు నడిపినట్లయితే వాటిని సీజ్ చేస్తామని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించరాదని తెలిపారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి వేటపాలెం

మండలంలో ప్రఖ్యాతి గాంచిన సారస్వతానికేతన్ గ్రంథాలయానికి ఒంగోలు మొబైల్ కోర్టు న్యాయమూర్తి వి ఎస్ రామారావు దంపతులు శనివారం సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేటపాలెం గ్రంథాలయాన్ని సందర్శించడం తనకు చాలా ఆనందం కలిగిస్తుంది అన్నారు జాతీయ దివ్యాంగుల హక్కుల చట్టం 2016 పోస్టర్ పుస్తకాన్ని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్. కాలేషా అందించి దివ్యాంగుల హక్కులను కాపాడాలని న్యాయస్థానాలు అండగా నిలవాలని దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా కోరారు

కళ్లద్దాలు అందజేత

ప్రజాశక్తి -మార్టూరు రూరల్ : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారధ్యంలో ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో వద్ధులకు శనివారం ఉచితంగా కళ్లజోళ్ళు, మందులు పంపిణీ చేశారు. ఇటీవల ఎమ్మెల్యే ఏలూరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నోవా అగ్రి గ్రూప్స్, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అందులో భాగంగా 150 మందికి శస్త్ర చికిత్సలు చేశారు. నెలరోజుల తర్వాత వారికి క్యాంపు కార్యాలయంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్ళు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతన్, ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజావేదిక' : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చీరాల

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా వేదిక ముఖ్య ఉద్దేశ్యమని చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొండయ్య శనివారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గత ఎనిమిది నెలల కాలంలో సుమారు రూ.50 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాలు, గోవుల షెడ్లకు రూ.13 కోట్లు, మున్సిపల్ అభివద్ధికి రూ.2 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మరికొన్ని అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. నియోజక వర్గంలో ఇళ్లస్థలాల సమస్య అధికంగా ఉందన్నారు. త్వరలోనే అర్హులైన లబ్ధి దారులు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీను, సీనియర్ నాయకుడు నాదెండ్ల కోటేశ్వరరావు, ముస్లిం మైనార్టీ నాయకుడు సయ్యద్ బాబు,ప్రజా వేదిక నాయకులు గుమ్మడి ఏసురత్నం, కోటి దాసు, జనసేన పార్టీ నాయకులు గూడూరు శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రమాదవశాత్తూ బావిలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి- దర్శి

ప్రమాద వశాత్తు దిగుబడు బావిలో పడిన ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మండలంలోని లంకొజనపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన రాయవరపు చిన్న వెంకటేశ్వర్లు (35) మృతి చెందాడు. బావి సమీపంలో ఉన్న చిక్కుడు చెట్టు వద్ద కాయలు కోస్తూ ప్రమాద వశాత్తు జారి బావిలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మతుడికి భార్యకుమార్తె, కుమారుడు ఉన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ నేత లక్ష్మణరావును గెలిపించాలి

ప్రజాశక్తి - నగరం

ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రజల గొంతుక, పిడిఎఫ్ నేత కెఎస్.లక్ష్మణరావు గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకుడు పి.నరసింహారావు మాట్లాడుతూ ఎయిడెడ్ విద్యావ్యవస్థ బాగుండాలని పిడిఎఫ్ అనేక పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. నిజాయతీగా ఉంటూ ప్రజాసమస్యలపై నిరంతరం మాట్లాడేది పిడిఎఫ్ మాత్రమే అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షుడు, యుటిఎఫ్ నాయకులు కె.సాయి ప్రసాద్, ఎం.చందర్రావు, ఎవి.లక్ష్మణరావు, కె.గోపి,జి. మరియదాసు తదితరులు పాల్గొన్నారు

నూతన దంపతులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-పర్చూరు

దేవరపల్లి గ్రామ వైసిపి సీనియర్ నాయకుడు తోకల కష్ణమోహన్ కుమార్తె వివాహం ఇటీవల నిర్వహించారు. అందులో భాగంగా వైసిపి పర్చూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి గాదె మధుసూదన్ రెడ్డి శనివారం దేవరపల్లి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భ:గా కష్ణమోహన్‌తో కొద్దిసేపు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. అనంతరం ఇనగల్లు గ్రామానికి వెళ్ళి మాజీ ఎఎంసి చైర్మన్ నరిశెట్టి ఆచార్యులును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కఠారి అప్పారావు, నాయకులు లంకా శివ, రావూరి వేణు, సీనియర్ నాయకులు మల్లీనీడి జగన్నాథం,ఉప్పాలపాటి అనిల్ చౌదరి, ఎస్‌కె.అజీమ్, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - పర్చూరు

గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని డిఎల్‌డిఒ డి.విజయలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిఎల్‌డిఒ మాట్లాడుతున్న సమయపాలన పాటించని సచివాల సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది ప్రతిరోజూ బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని ఆదేశించారు. (ప్రభుత్వం నిర్వహించే సర్వేలన్నీ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆధార్ కార్డు లేని జీరో నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఆధార్ నమోదు చేసేందుకు అధికారులు కషి చేయాలన్నారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఒను గ్రామ కార్యదర్శులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కోసనా సత్యనారాయణ, సిడిపిఒ జి.సుభద్ర, గ్రామ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

తాగునీటిపై సమీక్ష

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండల పరిధిలోని గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ డిఒ శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ సహాయకులకు సూచించారు. మండల పరిషత్ సమావేశం హాలులో తాగునీటిపై అధికారుతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వాటర్ ట్యాంకులను శుద్ధి చేసి నీటిని నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జ్యోతిర్మయి, ఎఇ మహమ్మద్ ఖాసిం, ఇఒపిఆర్‌డి శివరాం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీర్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నేత తవనం చెంచయ్య

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య

ప్రజాశక్తి -బాపట్ల

పాత ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసి సాధారణ జీవితం గడిపి సొంత ఇల్లు లేకుండా చరమాంకంలో సైతం అద్దె ఇంటిలోనే చివరి వరకూ జీవితం గడిపిన తవనం చెంచయ్య ఆదర్శనీయులు అని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య తెలిపారు. బాపట్ల పట్టణంలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తవనం చెంచయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చంచయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. కొండయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ తవనం చెంచయ్య వ్యవసాయ కార్మికులు, పేద ప్రజల కోసం నిరంతరం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

పోరాటం చేశారన్నారు. పిచ్చమానికలకులకు వ్యతిరేకంగా బంజరు భూముల కోసం కుల వివక్షకు వ్యతిరేకంగా కూలిపోరాటాలు చేశారన్నారు. ఎమ్మెల్యే అత్యంత సాధారణ జీవితం గడపటం ఎంతో ఆదర్శనీయమన్నారు. జిల్లాలో సిపిఎం ఉద్యమాన్ని నిర్మించడానికి అహర్నిశలు కషి చేశారని తెలిపారు. అనేక మంది యువ కార్యకర్తలను ప్రోత్సహించి ఉద్యమంలోకి తీసుకువచ్చారన్నారు. సుదీర్ఘకాలం సిపిఎం కార్యదర్శిగా బాధ్యత నిర్వహించిన తవనం చెంచయ్య జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్ కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందర్ మాట్లాడుతూ చంచయ్యతో తమకు న్న అనుభవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు సుభాషిణి, ఉపాధ్యాయ నాయకులు శ్రీనివాసరావు, సిపిఎం సీనియర్ నాయకుడు నూతలపాటి కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజంతోనే..

భావితరాలకు మనుగడ : డిఇఒ

ప్రజాశక్తి-బాపట్ల

ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనతోనే భావితరాల మనుగడ సాధ్యమవుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. పురుషోత్తం తెలిపారు. మానవతా స్వచ్ఛంద సేవ వా సంస్థ, మహిళా సమైఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిర్మలిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో ప్లాస్టిక్ నిషేధం పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక సరస్వతీ మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ర్యాలీని డిఇఒ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిషేధించాలన్నారు. వాటి స్థానంలో గుడ్డ సంచులను వినియోగించాలన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ డాక్టర్ శరత్ బోస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వినియోగం వల్ల పర్యావరణం దెబ్బ తినడంతో పాటు వాతావరణం దెబ్బతిని పురుషుల్లో పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుతుందన్నారు. ప్రజలు అనేక వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు.మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులను ఆహారం అనుకొని తిని ఆవులు, గేదెలు లాంటి మూగ జీవాలు మత్యువాత పడుతున్నాయన్నారు. అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని ప్లాస్టిక్ సమూలంగా నిర్మూలించేందుకు కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, మానవతా సంయుక్త కార్యదర్శి కోలా పద్మజ, మానవతా స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షుడు ఎం. సుబ్బారావు, కార్యదర్శి ఎం. ప్రసన్నాంజనేయులు, విజయ్ కుమార్, జి .శాంతారామ్, జివి, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణ, వ్యవసాయ కళాశాల, ఎస్ఎంజి ఉన్నత పాఠశాల, ఎవివి ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, విద్యార్థులు, ఫుడ్స్ సైన్స్ టెక్నాలజీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎన్‌సిసి ,ఎన్ఎస్ఎస్, మున్సిపల్ , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రేపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రేపల్లె : పర్యావరణానికి ప్రమాదంగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని స్వచ్ఛందంగా నిషేదించాలని కోరుతూ అవగాహన కల్పించాలని మున్సిపల్, మెప్మా సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ ను నిషేదిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ నినాదాలు చేశారు. మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో స్టీల్, పింగాణీ వస్తువుల వినియోగాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. మనం వినియోగిస్తున్న ప్లాస్టిక్ విషపూరితమైనదని, దాని ద్వారా సముద్రాలు సైతం కలుషితం అవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఇఒ పురుషోత్తం

విద్యార్థులు తల్లిదండ్రుల ఆశా దీపాలు

ప్రజాశక్తి- పర్చూరు.

తమ పిల్లల బాగోగుల కోసం నిత్యం కష్టించే తల్లిదండ్రులకు విద్యార్థులు ఆశా దీపాల లాంటి వారని మాజీ ఉప విద్యాశాఖాధికారి అబ్బరాజు శ్రీనివాసరావు తెలిపారు. శారదా హైస్కూలు స్థాపించి 40 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పాఠశాలలో శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం చదువుతూనే ఉండాలన్నారు. పట్టుదలతో బాగా చదివి స్టేట్ ర్యాంకుని సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ కె.రామకోటేశ్వరరావు అతిథులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు . ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాస్త్రవేత్త జి. శ్యామసుందర్, సివిల్ ఇంజినీర్ సత్యనారాయణ, చిన్నపరెడ్డి, డాక్టర్ మాధవ సతీష్, సుబ్రహ్మణ్యం ప్రిన్సిపాల్ కె. శాంతకుమారి, కోటి బాబు గొట్టిపాటి రంగారావు, సుబ్బారావు, గొట్టిపాటి సింగయ్య చౌదరి, కె.రామకోటేశ్వరరావు, కారుమూరి సీతారామయ్య, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పాఠశాల డైరెక్టర్ కె, శారదా దేవి పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

విద్యార్థులు కష్టపడి చదివితే ఎంతటి లక్ష్యాన్నైనా సులభంగా సాధించవచ్చని ప్రకాశం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ అఫ్ పోస్ట్స్ మహమ్మద్ జాఫర్ సాధిక్ తెలిపారు. శాతవాహన హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సదర్భంగా జాఫర్ సాధిక్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. విద్యార్థి దశలో త్యాగాలు చేయడం ద్వారా భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవచ్చని తెలిపారు. అనవసర అంశాల జోలికి వెళ్ళకుండ చదువుపై దష్టి సారించాలన్నారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తునందున సమయాన్ని వథా చేసుకోవద్దని విద్యార్థులను కోరారు. ఈ సందర్భగా విద్యార్థులు నిర్వహించిన సంస్కతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తేళ్ళ వెంకటరాము, డైరెక్టర్ తేళ్ళ అనురంజని, ప్రధానోపా ధ్యాయుడు కొప్పుల జాన్‌బోస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న శ్రీశారదా హైస్కూల్ విద్యార్థినులు

గురుకుల పాఠశాలలో మంత్రి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె పట్టణంలోని 3వ వార్డులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిపెడుతున్న ఆహార పదార్థాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ పాటిస్తున్నారా.? లేదా.? అని విద్యార్థులను ఆరా తీశారు. ఈ మేరకు విద్యార్థులు.. పాటిస్తున్నారని, భోజనం బాగుంటుందని మంత్రి వీరాంజనేయస్వామికి తెలిపారు. అనంతరం మంత్రి వీరాంజనేయ స్వామి పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో విద్య గొప్పదనం, ప్రాముఖ్యత గురించి మాట్లాడి విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో అనగాని శివప్రసాద్ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి స్వామి

ఎమ్మెల్సీగా లక్ష్మణరావును గెలిపించండి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి-వేమూరు

ప్రజాగొంతుకగా ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావు గెలుపు కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చుండూరు మండలంలో పలు విద్యాసంస్థల్లో శనివారం విస్తత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ పట్ట భద్రుల, ఉపాధ్యాయుల కోసం కేటాయించిన స్థానాల్లో వారికి ప్రాతినిధ్యం ఇవ్వటం ద్వారానే ప్రజల హక్కులు కాపాడబడతాయన్నారు. దేశవ్యాప్తంగా వస్తున్నటువంటి ఆర్థిక, రాజకీయ సామాజిక మార్పుల్లో భాగంగా రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రభుత్వ విధానాలపై చట్టసభల్లో గట్టిగా మాట్లాడలేనటువంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటువంటి తరుణంలో శాసనమండలిలో ప్రజల వాణి వినిపించే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, కూలీలు, మహిళలు, దళితుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించి.. వారికి అండగా నిలబడే లక్ష్మణరావుని శాసన మండలి ఎన్నికలలో గెలిపించటం కోసం మండలంలోని ప్రజాతంత్ర శక్తులందరూ కషి చేయాలని అన్నారు. ఏ ప్రభుత్వాలున్నా ప్రజలకు అండగా ఉంటున్న లక్ష్మణరావు గెలుపు ప్రస్తుత పరిస్థితుల్లో ముఖ్యమైనదని వివరించారు. లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి.. అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కష్ణమోహన్, ప్రజాసంఘాల నాయకులు కే.శ్రీమన్నారాయణ, కే.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు 'పది' అత్యంత ముఖ్యమైంది

శ్రీ విశ్వేశ్వరయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రెజరర్ డాక్టర్ రవిప్రసాద్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

విద్యార్థులకు తమ జీవితంలో పదో తరగతి అంత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నదని, ఈ సమయంలోనే కష్టపడి చదవాలని శ్రీ విశ్వేశ్వరయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రెజరర్ డాక్టర్ బొడ్డు రవిప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పేర్నమిట్టలోని బీవీ సుబ్బయ్య హైస్కూల్లో పాఠశాల వ్యవస్థాపకులు బీవీ సుబ్బయ్య మాస్టారి 103 వ జయంతి మరియు క్రీడా దినోత్సవం సందర్భంగా శనివారం పాఠశాల పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ బొడ్డు రవిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని తెలిపారు. మరో ముఖ్య అతిథి జూనియర్ కళాశాల రిటైర్డ్ లెక్చరర్ పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు తిప్పారెడ్డి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావంతో చదివి మంచి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు

పాఠశాల ముఖ్య సలహాదారు సందిరెడ్డి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై వేణుగోపాల రెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం విద్యార్థి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

'డిగ్రీ' ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఏకేయూ డిగ్రీ మూడో సెమిస్టరు పరీక్ష ఫలితాలను శనివారం నాడు విడుదల చేశారు ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయం పరిధిలో ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లా లోని 88 డిగ్రీ కళా శాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు నవంబర్-2024లో నిర్వహించిన రెండో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను ఏ.కే.యూ. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి. ఆర్. మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు విడు దల చేశారు. ఆయా కళాశాలల నుంచి 6019 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో 2780 మంది విద్యార్థులు 46.19 శాతం మేరకు ఉత్తీర్ణత సాధించినట్లు వి.సి. ప్రొఫెసర్ మూర్తి, ఏ.కే. యూ అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ అంచుల భారతీ దేవి వెల్లడించారు. కార్యక్రమంలో సి.ఈ.డాక్టర్ కే.వి.ఎన్. రాజు, ఏ.సి.ఈ. డాక్టర్ భారతీదేవి పాల్గొన్నారు.

'షేడ్ నెట్'పై అవగాహన

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

షేడ్ నెట్ కల్టివేషన్' రైతులకు ఎంతో ప్రయోజనకరమైనదని డిఆర్డిఏ వెలుగు పీడీ టి నారాయణ పేర్కొన్నారు. శనివారం నాడు టిటిడిసి కార్యాలయంలో "షేడ్ నేట్" వ్యవసాయం పై రైతులకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి గోపి, ఏపీ సీఎఎన్ ఎఫ్ అధికారి ఏ సుభాషిణి, బాంక్ లింకేజ్- డిపిఎం పి సనిత పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

కమిషనర్‌కు యూనియన్ నాయకుల వినతి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మున్సిపల్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని, అప్కాస్ రద్దు చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఒంగోలు నగర కమిటీ శనివారం నాడు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించింది. తమ డిమాండ్లు రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని యూనియన్ నగర కార్యదర్శి టి విజయమ్మ కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షులు టి.మహేష్ మాట్లాడుతూ కార్మికులను కాంట్రాక్టర్‌కు అప్పగించటం దారుణమన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, కొర్నెపాటి శ్రీనివాసరావు, కే సామ్రాజ్యం, వై రవి, జి.యామని, ఆర్ రాములు పాల్గొన్నారు.



కమిషనర్‌కు అర్జీ ఇస్తున్న నాయకులు

బాధితులకు రిలీఫ్ ఉద్యోగాలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌సి, ఎస్‌టి శిక్ష పడిన కేసుల్లో తీర్పు కాపీలను తెప్పించి బాధితులకు రిలీఫ్, ఉద్యోగాలు ఇప్పించాలని జిల్లా డిఆర్ఓ ఓబులేసును దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు కోరారు. స్థానిక డిఆర్ఒ ఛాంబర్‌లో శనివారం డిఆర్ఒకు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

'పివిఆర్' వార్షికోత్సవ సభలో డిఇఒ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విద్యార్థులకు చదువు విషయంలో కృషి, పట్టుదల, అంకితభావం ముఖ్యమని జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్ అన్నారు. శనివారం ఒంగోలు పివిఆర్ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈవో కిరణ్ కుమార్, విశిష్ట అతిథిగా డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావులు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుని బి లక్ష్మీప్రసన్న అధ్యక్షత వహించారు. పరీక్ష పై చర్చా కార్యక్రమంలో ఈ పాఠశాల విద్యార్థిని సాయి సహస్ర ప్రధాని నరేంద్ర మోడీతో నేరుగా మాట్లాడే అవకాశం రావడం ప్రకాశం జిల్లాకి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సిహెచ్ రంగనాథం, ఎల్ రాజగోపాల్,బి శ్రీరామ్మూర్తి, డివి సుబ్బారావు, దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులు 110 మందికి స్టడీ మెటీరియల్‌ను మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, సినీ నటుడు దన్నారపు మస్తాన్రావు, నత్తల శ్రీనివాస్ తదితరులు అందజేశారు . డాకా హనుమారెడ్డి కార్పొరేటర్ సుజాత దంపతులు ఉత్తమ విద్యార్థినులకు 25వేల రూపాయల క్యాష్ ప్రైజ్‌ను అందజేశారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

అబ్జర్వర్ల నియామకంలో అవకతవకలు

'బిఇడి' పరీక్షల నేపథ్యంలో అక్రమాలు!

ప్రజాశక్తి-మార్కాపురం

ఒంగోలులోని ఓ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సోమవారం నుంచి బిఇడి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించి అబ్జర్వర్‌ల నియామకంలో అవకతవకలు చోటు చేసుకున్నట్లు సమాచారం! వారం రోజుల క్రితం జరిగిన బిఇడి పరీక్షల్లో నియమించిన వారినే తిరిగి అదే పరీక్షా కేంద్రానికి కేటాయించడం గమనార్హం!

కొన్ని డిగ్రీ కళాశాలల్లో ఎలాంటి అడ్మిషన్‌లు లేకపోయినప్పటికీ అక్కడ పనిచేస్తున్నట్లుగా సష్టించుకున్న అధ్యాపకులే అబ్జర్వర్‌లుగా విధులకు నియామకం చేయడం శోచనీయం. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులోని ఓ డిగ్రీ కళాశాలలో చాలా సంవత్సరాలుగా అసలు అడ్మిషన్‌లు జరగలేదు. అక్కడ ఓ కాలేజి ఉన్నట్లు కూడా ఆనవాళ్లు కనిపించవు. కళాశాల భవనాలు మాత్రమే ఉంటాయి. ఆ భవనాల్లోనూ ప్రభుత్వ గురుకుల పాఠశాల నెలనెలా అద్దె పద్ధతిపై నిర్వహణలో ఉందని తెలిసింది. అక్కడ పని చేస్తున్నట్లుగా ఓ అధ్యాపకుడికి అబ్జర్వర్ డ్యూటీ నియమించడం వింతగా ఉంది. అబ్జర్వర్‌ల నియామకంలో అధ్యాపకుల సీనియారిటీని పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుత అబ్జర్వర్‌ల అందుకు భిన్నంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

మొదటగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని అధ్యాపకుల నుండి అబ్జర్వర్ల నియామకం జరగాల్సివుంది. ఆ తరువాత అవసరమనుకుంటే మాత్రం ప్రైవేటు కళాశాలల జాబితా ఆధారంగా అబ్జర్వర్‌లుగా విధులు అప్పగించాలి. నిబంధనలకు విరుద్ధంగా పూర్తిగా ప్రైవేటు కళాశాలలో పనిచేసే అధ్యాపకులనే అబ్జర్వర్లుగా నియమించడంలో మతలబు ఉందనేది బహిరంగ రహస్యమే.

కళాశాలలో పాఠాలే బోధించని కొంతమంది ప్రైవేట్ అధ్యాపకులకు పరీక్షా విధులలో నియమించడం ప్రశ్నార్థకమే. అబ్జర్వర్‌లుగా నియమించిన వారి పేర్లు కూడా ఆ కళాశాల నుంచి యూనివర్సిటీకి పంపిన స్టాఫ్ లిస్టులో పేర్లు కూడా లేకపోవడం విడ్డూరంగా ఉంది. ఒరిస్సా, బీహార్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లోని విద్యార్థులతో పరీక్షలు జరిగిపోతాయి. ఇక్కడి కళాశాలల్లో గత కొన్ని సంవత్సరాలుగా పొరుగు రాష్ట్రాల విద్యార్థులతో నిండిపోతున్నాయి. పొరుగు రాష్ట్రాల నుండి వచ్చిన వారంతా కేవలం పరీక్షల సమయంలో మాత్రమే కనిపిస్తారు. ఆ తరువాత ఆ కళాశాల వైపు కన్నెత్తి కూడా చూడరు. ఆ కళాశాలలు నిర్వహణలో ఉన్నాయా అనే అనుమానం కలగక మానదు. అలాంటి వాతావరణంలో బిఇడి కళాశాలలు ఇక్కడ దర్శనమిస్తుంటాయి. పరీక్షల సమయంలో చూస్కో... రాస్కో అన్నట్లుగా ముగిసిపోతాయి.

సంబంధిత ఉన్నతాధికారులు బిఇడి పరీక్షల నిర్వహణ తీరును ఆకస్మికంగా పర్యవేక్షిస్తే మాస్ కాపీయింగ్ ఏ స్థాయిలో జరుగుతుందో వెలుగులోకి రానుంది. బడి పంతుళ్లను తయారు చేసే బిఇడి కళాశాల పరిస్థితి ఇలాగుంటే... ఇలాంటి వారంతా ఉత్తీర్ణులై... ఆ తరువాత ఉపాధ్యాయ ఉద్యోగంలోకి అడుగు పెడితే... అక్కడి విద్యార్థుల చదువు చతికలబడక మానదు మరి.! బొత్తిగా చదువు లేని... ఉపాధ్యాయులే సమాజానికి దిక్సూచి అయితే... భావి భారత పౌరులు ఎలా తయారవుతారో ఏమో.?

కూలి రేట్ల జీవో విడుదల చేయాలి

ప్రజాశక్తి-కంభం

హమాలీలకు పెరిగిన కూలి రేట్లకు సంబంధించిన జీవోలు విడుదల చేయాలని హమాలీల యూనియన్ డిమాండ్ చేసింది. శనివారం నాడు హమాలీల పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ కంభం యంయల్‌యస్ పాయింట్ వద్ద సివిల్ సప్లైస్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిఐటియు నాయకులు ఎస్కే అన్వర్, యూనియన్ అధ్యక్షులు వి.చిన్న రంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పౌర సరఫరాల గూడెంలో లోడింగ్, అన్‌లోడింగ్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం 25 రూపాయల నుండి 28 రూపాయలకు కూలి పెంచటం జరిగిందన్నారు. ప్రభుత్వం జీవో ఇవ్వనందున పెంచిన కూలి రేట్లు అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెరిగిన కూలి అరియర్స్ వెంటనే ఇవ్వాలని, లేనిపక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చిన్న రంగస్వామి, వెంకట రంగయ్య, వెంకటరమణ, వి రామయ్య,టి గురవయ్య పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న హమాలీలు


మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ రమణ

పరిశ్రమల స్థాపనపై శిక్షణ

ప్రజాశక్తి-దర్శి

గత ఐదు రోజులుగా సంకల్ప్ – ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ శిక్షణ స్థానిక స్కిల్‌హబ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నారు. శిక్షణకు 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వి రమణ మాట్లాడుతూ వ్యవస్థాపకత విద్యార్థులకు చాలా కీలకమన్నారు. శిక్షణలో కవర్ చేసిన అంశాలు వ్యవస్థాపకత, వ్యాపార ఆలోచనలు రూపొందించడం, మార్కెటింగ్, బ్రాండింగ్, ప్రభుత్వ పథకాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యవస్థాపకతకు సంబంధించిన కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమంలో ఐఎల్ఓ శిక్షకులు రవీంద్ర, ప్రదీప్ మొత్తం అంశాలను బోధించారు. డిఎస్‌డిఓ జె రవితేజయాదవ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. స్కిల్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ నాగేష్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎస్ రమేష్ సమన్వయం చేశారు.


మాట్లాడుతున్న ఎంఇఒ రమాదేవి

బాలల హక్కుల గురించి బోధించాలి

ప్రజాశక్తి-దర్శి

ఉపాధ్యాయులు పాఠశాలల్లో బాలల హక్కుల గురించి విద్యార్థులకు బోధించాలని ఎంఇఒ కాకర్ల రఘురామయ్య, బి రమాదేవిలు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బాలల హక్కులు గురించి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో బాల్య వివాహాల నివారణ, బాలల హక్కులు వివరించాలని అన్నారు. ఇబ్బంది పడే చిన్నారుల కోసం ప్రభుత్వం 1098 హెల్ప్ లైన్ నెంబర్ ఏర్పాటు చేసిందని, దీనిని ఉపయోగించుకోవాలని అన్నారు.


మొక్కలు నాటుతున్న డిపిఓ వెంకట నాయుడు

చెత్త సేకరణకు సహకరించాలి

ప్రజాశక్తి-దర్శి

గ్రామాల్లో ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించి స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్రకు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు అన్నారు. మండలంలోని పోతవరం, దేవవరం గ్రామాల్లో స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర కార్యక్రమానికి తోడ్పడాలని కోరారు. చెత్త కేంద్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఎల్ కృష్ణమూర్తి, ఆవుల సుధాకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు సుబ్బారెడ్డి, మౌనిక, ఉపసర్పంచ్ ఏడుకొండలు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-మర్రిపూడి

మండల కేంద్రమైన మర్రిపూడి జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో పొదిలి అమృత కంటి ఆస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య కంటి శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వరికుటి భరత్ తెలిపారు. శుక్లాలు ఉన్నవారికి 50శాతం రాయితీతో ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. పేద ప్రజలకు ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) ద్వారా ఉచిత ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యాత్రికులు నిదానంగా వెళ్లి దర్శనం చేసుకోవాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మహాశివరాత్రి పండుగ సందర్భంగా దోర్నాల మీదుగా శ్రీశైలం వెళ్లే భక్తులు, యాత్రికులు నిదానంగా వెళ్లి దైవ దర్శనం చేసుకోవాలని మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పి మహేష్‌తో కలిసి ఆయన విలేకర్ల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25, 26 తేదీల్లో దిగువ శ్రీశైలంగా పిలువబడే దోర్నాల పట్టణం మీదుగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే వేలాది వాహనాలతో ట్రాఫిక్ రద్దీగా మారనుందని అన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని 25 నుంచి కర్నూలు వైపు వెళ్లే భారీ వాహనాలను కుంట, గిద్దలూరు, నంద్యాల వైపుకు మళ్లిస్తున్నట్లు తెలిపారు. తనతో పాటు 200 మంది పోలీసులు, 4సిఐలు, 9మంది ఎస్సైలతో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నామని అన్నారు. 25న రాత్రి నుంచి 2, 3 చక్రాల వాహనాలను దోర్నాల సమీపంలోని మల్లికార్జున పురం వద్ద నిలిపివేసి వారిని బస్సుల ద్వారా శ్రీశైలం పంపిస్తామని అన్నారు. 26న పండుగ రోజు ట్రాఫిక్‌ను బట్టి నాలుగు చక్రాల వాహ నాలను కూడా దోర్నాల దగ్గర ఆపేస్తున్నట్లు తెలిపారు. ఘాట్ రోడ్డులో చిక్కుకున్న వాహనాలను వెంటనే పక్కకు తీసి ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు మూడు క్రేన్‌లు, పది టీములను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఘాట్ రోడ్డులో వాహనాలు మరమ్మత్తులకు గురైతే వెంటనే బాగు చేసేందుకు ఐదు మంది మెకానిక్‌లను అందుబాటులో ఉంచామన్నారు. పాగాలంకరణ సమయంలో శ్రీశైలంలో రద్దీని దృష్టిలో పెట్టుకొని వాహనాలను దోర్నాల గణపతి చెక్‌పోస్టు సమీపంలోని పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపివే స్తామని అన్నారు. అనంతరం పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు.



మాట్లాడుతున్న మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు

సిఎస్.పురం : మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారుల సూచనలతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఇఒ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. దేవస్థానం ఆవరణలో మీడియా ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు దర్శన ఏర్పాట్లు, క్యూలైన్లు, తాగునీరు, భోజనవసతి, పార్కింగ్ సదుపాయం, విద్యుత్తు ఇతర అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. గండదీపోత్సవంకు దేవస్థానం ఆవరణలో ఇబ్బందులు లేకుండా విస్తరించామని అన్నారు. పామూరు సిఐ భీమానాయక్ మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవస్థానం సిబ్బంది, పోలీసువారికి సహకరించాలని కోరారు. కనిగిరి ఆర్టీసీ డిపోమేనేజర్ షయానాబేగం మాట్లాడుతూ మహాశివరాత్రికి కనిగిరి డిపో నుండి 25 ప్రత్యేక బస్సులు నారాయణస్వామి, భైరవకోనకు నడుపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ధర్మకర్త కె చిన్నఆదినారాయణ, ఎస్ఐ ఆర్ సుమన్, డాక్టర్ రాజేష్, విద్యుత్తు ఎల్ఐ కరుణాకర్, కె వెంకటరావు పాల్గొన్నారు.

కొనకనమిట్లలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల కేంద్రం కొనకనమిట్లలో పారిశుధ్య పనులు కూలీలతో ముమ్మరంగా చేపట్టారు. గత మూడు రోజులుగా సైడ్ కాలవల్లో, గుంటల్లోని మురికి, చెత్తను కూలీలతో తీయించారు. వివిధ ప్రాంతాల్లోని వీధుల్లో తీసిన చెత్త, పిచ్చి మొక్కలను ట్రాక్టర్ ద్వారా శనివారం తొలగించారు. కార్యదర్శి శ్రీనివాసులు దగ్గర ఉండి పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వీధుల్లోని చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని సూచించారు. ఇళ్ల వద్ద ఉన్న సైడ్ కాల్వలను పూడ్చి వేయరాదని, వర్షాలు కురిసినప్పుడు సైడ్ కాలువల ద్వారా నీరు పోయే విధంగా గ్రామస్తులు సహకరించాలని కోరారు. స్టేషన్‌పల్లి, ఎస్సీ కాలనీల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిచెట్లను తొలగిస్తామని తెలిపారు.


పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న కార్యదర్శి శ్రీనివాసులు

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-దర్శి

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని యుపిహెచ్‌సి సూపర్‌వైజర్ సుహాసిని అన్నారు. పట్టణంలోని ఎన్ఎస్‌పి ఎస్సీ కాలనీలో ప్రజలకు క్షయ వ్యాధి పట్ల శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వ్యాధిగ్రస్తులు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు ఇస్తారన్నారు. క్షయ వ్యాధి అంటు వ్యాధి కాదని, వ్యాధిగ్రస్థుల పట్ల వివక్ష వద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. త్రాగు నీటి విషయంలో జాగ్రత్తలు పాటిస్తే మలేరియా రాదన్నారు. కార్యక్ర మంలో షారోను, రమణ, హైమావతి, సుశీల పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యుపిహెచ్‌సి సూపర్వైజర్ సుహాసిని

జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు

- ఐదు మండలాల పరిధితో కోర్టు ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేసిన న్యాయవాదులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో ఐదు మండలాల పరిధితో నూతనంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేసినందుకు అనుమతి రావడంపట్ల న్యాయవాదులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. శింగరాయకొండలో ఏర్పాటు చేయబోతున్న కోర్టు పరిధిలోకి శింగరాయకొండ, జరుగుమల్లి, టంగుటూరు, కొండేపి, పొన్నలూరు రెవిన్యూ మండలాలను కలుపుతూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. శింగరాయకొండ పోలీస్ సర్కిల్ పరిధిలోని టంగుటూరు, శింగరాయకొండ, జరుగుమల్లి మండలాలతో పాటు కొండేపి సర్కిల్ పరిధిలోని కొండేపి, పొన్నలూరు మండలాలను కలిపారు. శింగరాయకొండలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కోర్టు పరిధిలోకి ఐదు మండలాలు చేర్చినందుకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె మన్మధరావుకు జిల్లా కోర్టు జడ్జిలకు న్యాయవాదులు సన్నెబోయిన శ్రీనివాసులు, కె మల్లికార్జునరావు, కొల్లూరి నరసింహారావు, బక్కమంతల వెంకటేశ్వర్లు, టంగుటూరు మండల న్యాయవాదులు పాలవల్లి సంజీవరెడ్డి, ఉన్నం, మారుతి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.


వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

యువకుడిని క్షేమంగా తీసుకురావాలి

ప్రజాశక్తి-దర్శి

కాలవలో కొట్టుకుపోయిన యువకుడి ఆచూకీ తెలుసుకొని.. క్షేమంగా బయటకు తీసుకురావాలని సంబంధిత పోలీస్, ఫైర్ అధికారులకు డాక్టర్ లక్ష్మీ ఫోనులో సమాచారం ఇచ్చి పర్యవేక్షించారు. దర్శి నుండి కురిచేడు వెళ్తున్న ఆమె కురిచేడు రోడ్‌లోని సాగర్ కెనాల్ వద్ద దర్శి మండలం వెంకటాచలంపల్లి పంచాయతీ పరిధిలోని నడింపల్లి గ్రామానికి చెందిన 17ఏళ్ల పుప్పాల వీరనారాయణ ప్రమాదవశాత్తు కాలువలో పడిపోగా అక్కడ గుమికుడిన ప్రజలను చూసినామె ఆగి విషయం తెలుసుకొని వెంటనే దర్శి డిఎస్పీ బి లక్ష్మీనారాయణ, దర్శి ఎస్ఐ మురళిని ఫోన్‌లో సంప్రదించి గజ ఈతగాళ్ళను పిలిపించాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా ఆ కుర్రాడి ఆచూకీ తెలియజేయాలని ఆదేశించారు.


శివ స్వాముల ఊరేగింపులో బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ఇరుముడి ఊరేగింపులో 'బూచేపల్లి'

ప్రజాశక్తి కురిచేడు

శివ దీక్ష తీసుకున్న భక్తులు 40రోజుల కఠిన నియమాల దీక్షను శనివారంతో పూర్తి చేసుకొని ఇరుముడితో శ్రీశైలానికి బయలు దేరారు. ఈ సందర్భంగా జరిగిన ఊరేగింపులో ఎంఎల్ఎ బూచేపల్లి శివప్రసాదరెడ్డి స్థానిక శివాలయం నుండి రైల్వే స్టేషన్‌కు పోవు రోడ్డు వరకు నడిచారు. జడ్‌పిటిసి నుసుం వెంకటనాగిరెడ్డి, వైసిపి కన్వీనర్ యన్నాబత్తిన సుబ్బయ్య, ఎంపిటిసి బుల్లం వెంకట నరసయ్య, గోగులముడి లింగారెడ్డి, పోతిరెడ్డి నాగిరెడ్డి, వూట్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న కదిరి పార్థసారథి

వధూవరులకు 'కదిరి' ఆశీర్వాదం

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని శీలంవారిపల్లె గ్రామానికి చెందిన కదిరి మాలకొండయ్య కుమారుడు గోపి వివాహ వేడుకకు కదిరి బాబురావు విద్యాసంస్థలు సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి హాజరై వరుడు గోపిని ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల వివాహం జరిగిన సిఎస్‌పురంకు చెందిన యాసం వెంకటేశ్వర్లు కుమారుడు శ్రీకాంత్, వెన్నెలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మునగల నారాయణ రెడ్డి, నున్నా నారాయణ, జలాల్, నారాయణస్వామి, కదిరి శివ, నరేష్, కదిరి సూరి, ఉపసర్పంచ్ టి బాబురావు, సంగిశెట్టి పీరయ్య పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో చేరే విద్యార్థులు ఈనెల 24నుండి ఆన్‌లైన్‌లో ధరకాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ హసీనా భాను శనివారం తెలిపారు. పాఠశాల విద్యా డైరెక్టర్ విజయరామరాజు ఆదేశానుసారం మార్చి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 5వ తరగతి స్థాయిలో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల ఓసి, బిసి విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ఫీజులు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - పర్చూరు

ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇఒఆర్‌డి కొసన సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో శని, ఆదివారాల్లో రెండు రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చెత్త నుంచి సంపద సష్టి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి తడి చెత్త, పొడి చెత్త సేకరణపై అవగాహన కలిగించారు. ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాల నుంచి తడి, పొడి చెత్త వేరే చేసి ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు, గ్రామ కార్యదర్శులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించారు. అనంతరం ఆ చెత్తను సంపద సష్టి కేంద్రాలకు తరలించారు . ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు పాల్గొన్నారు

భట్టిప్రోలు : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. ఐలవరం గ్రామంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు రహదారులను శుభ్రపరిచి చెత్తా,చెదారాన్ని బయట ప్రాంతానికి తరలించారు. ఇంటింటి నుంచి చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ కార్యక్రమంలో



భటిప్రోలులో చెత్త సేకరిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేటపాలెం : పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపిడిఒ మెడబలిమి రాజేష్ బాబు తెలిపారు. మండల పరిధిలోని తొమ్మిది గ్రామపంచాయతీలలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్ శనివారం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు అధికారులు అందరూ క్షేత్ర స్థాయిలోనే ఉండాలన్నారు. ఉదయం 6 గంటలకే అధికారులు విధులకు హాజరు ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలన్నారు. గ్రామాల్లోని చెత్త కుప్పలు రోడ్ మార్జిన్ ఉన్న పేడ దిబ్బలను సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. చెత్త సేకరణ వివరాలను పిఆర్‌ఒన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎంత మంది హరిత రాయబారులు పని చేశారు. ఎన్ని గహాల నుంచి చెత్త సేకరణ చేశారు అనే వివరాలు పంచాయతీ కార్యదర్శి లాగిన్‌లో నమోదు చేయాలన్నారు ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి అన్నం శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీలు తాటి మాల్యాద్రి రావు, నక్కల శ్రీనివాసరావు, వేమూరి రామమోహరావు, మోతుకూరి మోహన్ రంగారావు, వెంకటేశ్వరరావు, బాలిక సురేంద్రబాబు, షేక్ గౌస్ మొహిద్దిన్ అలీ, రణం పూర్ణ కుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెరుకుపల్లి : గ్రామాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రేపల్లె డిఎస్‌పిఒ శ్రీనివాసన్ తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. చెరుకుపల్లి మండల పరిధిలోని చెరుకుపల్లి, గుళ్లపల్లి, గూడవల్లి, కనగాల, నగరం మండలంలోని నగరం పంచాయతీల్లో చేపట్టిన పారిశుధ్య పనులను పర్యవేక్షించి పంచాయతీ కార్యదర్శులకు, క్లాప్ మిత్రాలకు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఈవూరి విజయబాబు, జి. మురళీకష్ణ, కె. సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


రేణుకమ్మను ఊరేగిస్తున్న రాయిని వంశస్తులు

నేడు విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - పంగులూరు : మండల కేంద్రమైన పంగులూరులో రేణుకమ్మ తల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం జరుగునుంది. రాయిని వంశస్తులు రూ.60 లక్షలతో వ్యయంతో అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. ఆదివారం ఉదయం 10 గంటల 23 నిమిషాలకు రేణుకమ్మ తల్లి ,పోతురాజు, మరియు శిఖర ప్రతిష్టను ప్రముఖ వేద పండితులు వేముల శ్రీహరి చౌదరి నిర్వహించ నున్నారు. సాయంత్రం వైభవోపేతంగా అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అనంతరం అన్నదానం నిర్వహించనున్నుట్లు నిర్వహకులు తెలిపారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- భట్టిప్రోలు

ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెల 6న నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధనలక్ష్మి విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు మండల కార్యదర్శి జి.సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో నిరంతరం గ్రామాల్లో తిరుగుతూ పని



మాట్లాడుతున్న కె. ధనలక్ష్మి

చేసే ఆశ వర్కర్లకు తక్షణమే వేతనాలను పెంపుదల చేయాలన్నారు. గ్రాట్యూటీ , బీమా సౌకర్యం కల్పిం చాలన్నారు. మేటర్నిటి సెలవులు మంజూరు చేయాలన్నారు. , అర్హత కలిగిన ఆశ వర్కర్లకు ఎఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు,సభ్యులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వైసిపి సోషల్ మీడియా అధ్యక్షుడిగా తనీష్‌బాబు

ప్రజాశక్తి-వేమూరు : వేమూరు నియోజకవర్గ వైసిపి సోషల్ మీడియావిభాగం అధ్యక్షుడిగా కొల్లూరు మండలం చినపులివర్రు గ్రామానికి చెందిన బాణాల తనీష్ బాబు నియమితులయ్యారు. వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి,నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో తనీష్ బాబును సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా నిమించారు. ఈ సందర్భంగా తనీష్‌బాబు మాట్లాడుతూ తన నియమకానికి కృషి చేసిన మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి, అశోక్ బాబుకు ధన్యవాదాలు తెలియజేశారు.కూటమి ప్రభుత్వ అరాచకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేస్తానన్నారు.

'జ్ఞాన జ్యోతి'తో అంగన్‌వాడీల బలోపేతం

ప్రజాశక్తి- చుండూరు

జ్ఞాన జ్యతి 120 రోజుల శిక్షణ అంగన్‌వాడీల బలోపేతానికి దోహదపడతాయని జిల్లా కోఆర్డినేటర్ సుభాని సూచించారు. మండల పరిధిలోని మండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో శనివారం నాటికి నాల్గవరోజుకు చేరింది. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ 0 నుంచి 6 సంవత్సరాలలోపు మానసిక శారీరిక ఎదుగుదలతో పాటు నూతన అంశాలను చిన్నారులు గుర్తించే విధంగా అంగన్‌వాడీలు విద్యాబోధన చేయాలన్నారు. సర్వ శిక్ష అభియాన్, పాఠశాల విద్యా కమిటీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మరో రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణను అంగన్‌వాడీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చుండూరు సెక్టార్ అంగన్‌వాడీ సూపర్ వైజర్ జి. శకుంతల, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. అదేవిధంగా చుండూరు మండలం మోదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో ఎంఇఒ సాల్మన్ రాజ్ మాట్లాడారు. మూడు


చుండూరులో మాట్లాడుతున్న సుభానీ

నుంచి ఆరు సంవత్సరాల పిల్లల జాబితాలను తమకు అందజేసి వారిని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించే విధంగా చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో చుండూరు సెక్టార్ సూపర్‌వైజర్ జి. శకుంతల, పాఠశాలకు హెచ్‌ఎం చలపతిరావు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల : అంగన్‌వాడీ కేంద్రాలే విద్యార్థి భవితకు పటిష్టమైన పునాది అని బాపట్ల సమగ్ర శిక్షా ఎంఎంఒ బి. మోజెస్ తెలిపారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్ లో అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రి ప్రైమరీ విద్యా వ్యవస్థ లో అంగన్‌వాడీల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. విద్యా వ్యవస్థలో చోటు చేసుకుంటున్న అనేక మార్పులకు అనుగుణంగా విద్యా భోదన జరగాలని సూచించారు. సమగ్ర శిక్షా, పాఠశాల విద్యాశాఖ,ఐసిడిఎస్ అధ్యర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ చిన్నారుల భవితకు ఎంత గానో దోహద పడతాయని పేర్కొన్నారు. ఈసందర్భంగా అంగన్‌వాడీలకు విద్యా బోధనకు అవసరమైన భోదనోపకరణలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎంఇఒ ఎస్. నిరంజన్,మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం బి. రాజశ్రీ. సిడిపిఒ శివ పార్వతి, సూపర్ వైజర్ జ్యోతి, బోధనా సిబ్బంది ప్రసాదబాబు, నారాయణ, బాలకోటేశ్వరరావు, రిసోర్స్ పర్సన్ నాగలక్ష్మి , మాణిక్యారావు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని అక్కాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ పూజ నిర్వహించారు. అనంతరం వార్షికోత్సవ వేడుకలు, పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భవనం బద్రిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే క్వాలిఫైడ్ ఉపాధ్యాయులచే మంచి క్వాలిటి విద్య, విలువలు, సంస్కారం, ప్రయోగాత్మక విద్య అందిస్తున్నట్లు తెలిపారు. విద్యా కానుక పేరుతో సంవత్సరానికి సరిపడా అన్ని రకాల పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, బ్యాగ్ లు, నిఘంటువులు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, అనురాధ, అంజమ్మ, బాలసుబ్రమణ్యం, ఖమరున్నిసా బేగం, రమణ, విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు రక్తదానం

ప్రజాశక్తి- అద్దంకి

అద్దంకి పట్టణంలోని నర్రావారిపాలెం చెందిన పూసపాటి శివపార్వతి అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో చేర్పించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అత్యవసరంగా ఒ పాజిటివ్ రక్తం ఎక్కించాలని కుటుంబు సభ్యులు తెలిపారు. దీంతో శివపార్వతి కుటుంబ సభ్యులు రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారిని ఆశ్రయించారు. రోటరీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్, కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, బంగ్లా రోడ్డులోని ఫొటో స్టూడియో యజమాని పెండ్యాల ఆనందరావును ప్రోత్సహించి రక్త దానం చేయించారు. ఇది రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేసిన 443వ రక్తదానం. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, యరమోతు రమేష్ బాబు, సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు

పోలీసులకు జనసేన నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి - రేపల్లె :

కుంభమేళాలో పాల్గొన్న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రాసంశెట్టి మహేశ్ డిమాండ్ చేశారు. సోషల్ మీడియా పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడి విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కుంభమేళాలో పవన్ కల్యాణ్ పవిత్ర స్నానం చేసినట్లు తెలిపారు. అందుకు సంబంధించిన ఫొటోలను కొందరు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు తెలిపారు.

పొలాలు సందర్శన

ప్రజాశక్తి- కారంచేడు : మండల పరిధిలోని తిమ్మిడితపాడు గ్రామంలో సాగుచేసిన నూతన వంగడాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు శనివారం సందర్శించారు. గ్రామానికి రైతు బోధవుల లక్ష్మీనారాయణ కొత్త వంగడాలను సాగు చేశాడు. రైతు సాగు చేసిన పంటలను లాఫాం వ్యవసాయ శాస్త్రవేత్తలు డిఇ డాక్టర్ శివన్నారాయణ, ఎడిఆర్ డాక్టర్ ఎన్ వివిఎస్.దుర్గాప్రసాద్, బాపట్ల డాట్ సెంటర్ కోఆర్డినేటర్ శాస్త్రవేత్త మురళిధర్ నాయక్ సందర్శించారు. కొత్త వంగడాలు కాబులీ రకాలు ఎన్‌విఇజి 810, ఎన్‌బిఇజి 833, దేశవాళి రకాలు ఎన్ 1267, శనగ పంట కొత్త వంగడాలను వారు సందర్శించారు ఈ కార్యక్రమంలో స్థానిక ఎఒ సుధీర్ బాబు, రైతులు బోడవుల వెంకటనారాయణ, ఆలపాటి సుబ్రహ్మణ్యం, కొమ్మాలపాటి విశ్వేశ్వరరావు , సీతా బాబూరావు,గ్రామ వ్యవసాయ సహాయకుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలపై ఆధారాలు సేకరించండి

- స్థలాలు, భూముల వాస్తవ యజమానులు గుర్తించాలి
- అధికారులకు రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సిసోడియా ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు, పరిసర ప్రాంతాలలో భూములు, ఇళ్ళ స్థలాలకు నకిలీ పత్రాలను ఎవరు సష్టించారో ఆధారాలను సేకరించాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియా అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలో శనివారం కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణతో కలసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఒంగోలు, పరిసర ప్రాంతాలలో నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపులు, ఫోర్జరీ సంతకాలతో రెండేళ్ళ క్రితం వెలుగుచూసిన భూ అక్రమాలపై సిసోడియా ఆరా తీశారు. ఈ అక్రమాలపై ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బందం (సిట్) ఏర్పడటంతో ఎన్ని కేసులు నమోదు అయ్యాయి, వాటి దర్యాప్తు పుతోగతి, చార్జి షీటు దాఖలు, తదితర అంశాలపై ఆయన అరా తీశారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ ఈ కేసులకు సంబంధించిన స్థలాలు, వ్యవసాయ భూములపై రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్, ఇతర పత్రాలను పరిశీలించి వాటికి సంబంధించిన వాస్తవ యజమానులను, డాక్యుమెంట్లను గుర్తించాలన్నారు. ఇందుకోసం రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. సిట్ పరిధిలోకి రాని కేసులను తొలగించాలని, మిగతా కేసులలో విచారణ వేగవంతం చేయాలని దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ 15 రోజులలోగా సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ ఏ. బాలంజనేయులు. ఒంగోలు ఆర్డీవో లక్ష్మిప్రసన్న, ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, సిఐలు అజయ్‌కుమార్, శ్రీకాంత్, నాగరాజు, పాండురంగారావు, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఒంగోలు తహశీల్దార్ వాసు, ఇతర తహశీల్దార్లు, ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కేసుల వివరాలు పరిశీలిస్తున్న రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సిసోడియా

భూగర్భజలాలు పెంచడంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

భూగర్భ జలాల పెరుగుదల కోసం అంగన్వాడి కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. భూగర్భజలాల పెరుగుదలపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జలవనరులను సంరక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించిందని కలెక్టర్ చెప్పారు. వర్షపునీటిని ఒడిసిపట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ భవనాలపై కురిసే వర్షపు నీరు నేరుగా భూమిలోకి వెళ్లేలా ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. ప్రజా ప్రయోజనం కోసం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు చేరుకోవాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే ప్రతి అంగన్వాడి కేంద్రం వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాలపై ఆయన ఆరా తీశారు. 261 ఇంకుడు గుంతలు నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా ఇచ్చిందని, అందులో 112 పూర్తి కాగా, 129 నిర్మాణంలో ఉన్నాయన్నారు. మిగిలిన 18 ఇంకుడు గుంతల నిర్మాణాలకు భూ సేకరణ చేపడుతున్నామని కలెక్టర్‌కు ఎస్ ఈ పంచాయతీరాజ్ వివరించారు. నిర్దేశిత లక్ష్యాలను యుద్ధ ప్రాతిపదికన ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్. ఈ ని ఆయన ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాల్లో 190 మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం లక్ష్యాలను ఇచ్చిందన్నారు. 73 అంగన్వాడీ కేంద్రాలలో విద్యుత్ కనెక్షన్లను ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అందులో 46 కనెక్షన్లకు సర్వీస్ వైర్ ఏర్పాటు చేయగా, మిగిలిన 27 కనెక్షన్లను ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పిడి ఉమా, పంచాయతీరాజ్ ఇంచార్జి ఎస్ఈ జి రతన్ బాబు, ఆర్.డబ్ల్యూ.ఎస్ డీ.ఈ మాధవి, ఏపీ సీపీడీసీఎల్ డిఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

లక్ష్మణరావును గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి-రేపల్లె

గ్రాడ్యుయేట్ల అభివృద్ధి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావు విజయంతోనే సాధ్యమని రైతుసంఘం రాష్ట్ర నాయకులు పి.నరసింహారావు అన్నారు. ఉమ్మడి కష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావు విజయాన్ని కోరుతూ పట్టణంలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గ్రాడ్యుయేట్ అభ్యర్థులను కలిసి లక్ష్మణ్‌రావుకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ప్రజా నాయకుడు కేఎస్.లక్ష్మణ్‌రావు అని చెప్పారు. అనంతరం సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసనమండలి ఉద్దేశానికి విరుద్ధంగా నేడు రాజకీయ పార్టీలు నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయటం విచారకరమని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలు శాసనమండలి మౌలిక స్వభావాన్ని నీరుగార్చే విధంగా రాజకీయ నాయకులు పోటీ చేస్తున్నారని విమర్శించారు. శాసనమండలిలో మేధావులను, ప్రత్యేక నైపుణ్యం కలిగిన వారిని, పెద్దలను ఎంపిక చేసి ప్రభుత్వాలకు సూచనలు సలహాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే కార్పొరేట్ల హస్తగతమైన నేటి రాజకీయాలలో పెద్దల సభలో కూడా ప్రవేశించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, ఇలాంటి పోకడలతో శాసనమండలి ఉద్దేశ్యం నీరు గారుతుందన్నారు. కే.ఎస్.లక్ష్మణరావు ఉన్నత విద్యావంతులని, అనేకమంది యువతకు స్ఫూర్తిగా నిలబడి వారి భవిష్యత్తును తీర్చిదిద్దిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. శాసనమండలి ఏర్పాటు ఉద్దేశం నెరవేరాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్.లక్ష్మణ్ రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణి లాల్ బిఎల్ కే ప్రసాద్, కే రమేష్, ఆశీర్వాదం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న రైతుసంఘం రాష్ట్ర నాయకులు నరసింహారావు

'వెలిగొండ' కోసం ఉద్యమం



మూడు జిల్లాల కలల సాకారం వెలిగొండ ప్రాజెక్టు కోసం మరోసారి ఉద్యమం చేపట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రాజెక్టు కోసం మళ్లీ ఉద్యమం ఊపందుకుంది. ఎన్నికల్లో హామీలు ఇచ్చిన పాలక, ప్రతిపక్షాలు మౌనంగా ఉన్నాయి. ఇప్పుడు వెలిగొండ కోసం ఇప్పుడు వామపక్షాలు ఆందోళన చేపట్టాయి. దశలవారీగా ఉద్యమాలు చేపట్టాయి. పాలకపక్ష నేతలు హామీలు ఇవ్వడం తప్ప ఆచరణలో దాన్ని పూర్తి చేయాలనే దిశగా చర్యలు ఇప్పటికీ చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావచ్చింది. మంత్రులు పర్యటించి రెండేళ్లలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత ఏం జరుగుతుందంటే ఏమీ లేదు. ఇక ప్రాజెక్టును పూర్తిచేయకుండానే అప్పటి సిఎం జగన్ దాన్ని ప్రారంభించారు. దాని వల్ల ఇప్పుడు వైసిపి నేతలు ఏమీ మాట్లాడలేని దైన్యంలోకి వెళ్లారు. దాన్ని పూర్తిచేయాలని చెప్పే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో సిపిఎం, సిపిఐ, రైతుసంఘం ఆందోళనలు చేపడుతున్నాయి. సిపిఎం ఇప్పటికే దశలవారీగా ఆందోళనలు చేపట్టింది. వెలుగొండకు తక్షణం రూ.2 వేల కోట్లు ఇవ్వాలని డిమాండ్‌తో ఉద్యమం చేపట్టింది. ఇప్పటికే ఈ ప్రాజెక్టును సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సందర్శించారు. నిర్వాసితులతోనూ మాట్లాడారు. దీని సాధన ఉద్యమంలో భాగంగా కనిగిరి, మార్కాపురంలో సదస్సులు జరిగాయి. ఎమ్మెల్యేలను కలిసి నిధులు సాధించాలని వినతిపత్రాలు ఇస్తున్నారు. మండల కేంద్రాల్లోనూ వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపట్టారు. మరోవైపు రైతుసంఘం కూడా రైతులను సమీకరించి జిల్లాలో పలుచోట్ల ఆందోళనలు చేపట్టింది. ఇక సిపిఐ కూడా వెలిగొండకు రూ.2వేల కోట్లు ఇవ్వాలని కార్యక్రమాలు చేపడుతోంది. ఇలా వామపక్షాలు వెలిగొండ కోసం విడివిడిగా ఆందోళనలు కొనసాగిస్తున్నాయి. అన్ని వైపులా ఒత్తిడి చేస్తున్నాయి. మంత్రులకు పట్టడం లేదు. దీన్ని పూర్తిచేయాలంటే పాత లెక్కల ప్రకారమే ఇంకా రూ.4 వేల కోట్లు కావాలి. సవరించిన అంచనాల ప్రకారం ఇంకా పెరుగుతోంది. ఏటా రూ.2 వేల కోట్లు కేటాయిస్తే తప్ప ఇది పూర్తికాదన్న విషయం గుర్తించాలి. ఆ దిశగా నిధులు కేటాయింపుల్లేవు. ఈ ఏడాది జరగాల్సిన పనులు ఏమీ కనిపించడం లేదు. మంత్రులు పెట్టిన గడువు రెండేళ్లు. ఇప్పుడు జరుగుతున్న తంతు చూస్తే సాధ్యం కాదనిపిస్తోంది. నిర్వాసితులకు ఇంతవరకూ ప్యాకేజీలు ఇవ్వలేదు. వీరికి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తే అక్కడ నుంచి ఖాళీ చేస్తారు. పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు లేవు. అన్నీ అసంపూర్తిగానే ఉండటానికి కారణం నిధుల కేటాయింపులు సంక్లిష్టంగా మారడమే. అందుకే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దీనికి నిధులు కేటాయించి పూర్తిచేయాలని వామపక్షాలు ఉద్యమం చేపట్టాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల ఘట్టం తుదిదశకు చేరింది. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. పిడిఎఫ్ నుంచి సిట్టింగు ఎమ్మెల్సీ లక్ష్మణరావు పోటీలో ఉండగా తెలుగుదేశం నుంచి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ బరిలో ఉన్నారు. ఇక తెలుగుదేశం అభ్యర్థి గెలుపు కోసం మంత్రులు రంగంలోకి దిగారు. అన్ని రకాలుగా ప్రలోభాలకు తెర లేపారనే చర్చ సాగుతోంది. పట్టభద్రుల ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఇటీవల పార్టీలు రంగంలోకి దిగుతున్నాయి. ఎవరు అధికారంలో ఉంటే ఆ పార్టీ నుంచి గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు తెలుగుదేశం ఇదే పనిలో పడింది. అయితే వైసిపి ఈ ఎన్నికలకు దూరంగా ఉంది. పిడిఎఫ్ నుంచి పోటీ ఉంది. ఉద్యోగులు, కార్మికులు, యువకులు, వివిధ వర్గాల గ్రాడ్యుయేట్స్ తరుపున ఆయన పోటీలో ఉన్నారు. ఈయన గెలిస్తే జనం తరపున ప్రశ్నించే ఎమ్మెల్సీగా ఉంటారు. అదే తెలుగుదేశం నుంచి గెలిస్తే పాలకపక్షం చేసేవాటికి మద్దతు ఇవ్వడం తప్ప గళం విప్పే అవకాశమే ఉండదు. తెలుగుదేశం నుంచి ఒక నేతకు పదవి కోసం పోటీలో పెట్టారే తప్ప ప్రజల గొంతుక మాత్రం కాదని గుర్తించాలి.

మార్కెట్‌లోకి పంట చేతికందే దశలో ధరల పతనం కొనసాగుతోంది. ప్రస్తుతం మిర్చి ధరలు పడిపోయాయి. దానిపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. పాలకపక్షం స్పందించి వైసిపిపై ఎదురుదాడి చేస్తోంది. మంత్రులు మాటలు పెంచారు. అయితే రైతులకు గిట్టుబాటు ధర అందుతుందా? లేదా? అన్న కోణంలో పాలకపక్షం ఆలోచించాలి. మరో పది రోజుల్లో శనగ నూర్పిడికి రానుంది. దీని ధరలు కూడా పడిపోయాయి. నెల రోజుల క్రితం ఉన్న ధరలు ఇప్పుడు లేవు. పొగాకు వేలం కూడా ఈ వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. రైతులు ఆశగా ఉన్నారు. మరోవైపు వాతావరణం అనుకూలంగా లేనందున పంటల సాగు తగ్గింది. అన్ని రకాల పంటల దిగుబడి కూడా తగ్గుతోంది. పెట్టుబడులు పెరిగాయి. గిట్టుబాటు ధరలు ప్రశ్నార్థకంగా మారాయి. వాటిపై ఎవరైనా స్పందించి మాట్లాడితే వారిపై పాలకపక్షం మాటల తూటాలు పేలుతుంది. ఇది సరైన పద్ధతా? కాదా? అనేది ఆలోచించాలి.గతంలో ఇలా వ్యవహరించినందునే వైసిపి పరిస్థితి ఏమైందో ఇప్పుడు పాలకపక్షం కూడా ఆలోచించాలి.

పాలనలో అవినీతి తగ్గలేదు. రెవెన్యూ యంత్రాంగం ముడుపులు తీసుకొని గుడ్డిగా భూములను అనర్హులకు అప్పగిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఎక్కిస్తున్నారు. యర్రగొండపాలెంలో ఆర్‌అండ్‌బీ స్థలం వ్యవహారం ఇందుకు తార్కాణం. తహశీల్దార్ సహా పలువురు సిబ్బందిపై కలెక్టర్ వేటు వేశారు. గతంలోనూ మార్కాపురం ప్రాంతంలో పలువురు రెవెన్యూ ఉద్యోగులు ఇదే వ్యవహారంలో చర్యలకు గురయ్యారు. అయినా రెవెన్యూ యంత్రాంగంలో మార్పురావడం లేదు. భూముల వ్యవహారంలో ఇప్పటికీ సరైన చర్యలు తీసుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో భూ వివాదాలు పెరగడానికి రెవెన్యూ యంత్రాంగమే కారణమవుతోంది.